


నిప్పులు తొక్కిన కోతిలా చిందులేస్తున్నారు పరాంకుశంగారు ఆ చిందులు తొక్కడానికి గల కారణం తెలిసిన భజగోవిందం బొమ్మలాగా చేతులుకట్టుకుని నిల్చున్నాడు. సత్యవతమ్మగారు వెక్కి వెక్కి ఏడుస్తూ మధ్యమధ్యన ముక్కు చీదేస్తున్నారు.

"ఇప్పుడేం చేస్తామంట?" అంది వున్నట్లుండి. పరాంకుశం గారు ఒకక్షణం ఆగి శ్రీమతి ముఖంలోకి చూసి - పెదవి విరిచారు ఏం చెయ్యాలో తెలియదన్నట్లు.

భజగోవిందానికి చాలా ఆశ్చర్యమనిపించింది. పలక్షన్లకు ముందు డబ్బు కావాల్సొచ్చినపుడు గోదాంలోని ధాన్యం బస్తాలను ఊకబస్తాలుగా మార్పించి నిప్పు అంటించేసి, అవి కాలి బూడిదగా మారినాక ఇన్సూరెన్సు డబ్బుకు క్లెయిమ్ పెట్టారు. అప్పటినుండి శ్రీవారి తెలివి

తేటలమీద గొప్పనమ్మకం. భక్తి ఏర్పరుచుకున్నాడు భజగోవిందం. అటు వంటిది నేడిలా యింత చిన్న విషయాన్ని శ్రీవారు పరిష్కరించలేకపోవడం ఆశ్చర్య మనిపించింది.

శ్రీవారు తనచేతిని భజగోవిందం భుజంమీద వేసేసరికి ఉలిక్కిపడ్డాడతడు

"గోవిందం! నువ్వే చెప్పు. పావలా పూలుకొని, రూపాయి నోటిచ్చి, చిల్లర తీసుకోవడం చిన్నతనంగా భావించే అమ్మాయిని. పావలా పూలను పది పైస లకు బేరమాడే అబ్బాయికిచ్చి ఎలా పెళ్ళి చెయ్యమంటావు?" అన్నారు. ఆమాట విని రుసరుసలాడుతూ చూసారు సత్య వతమ్మ శ్రీవారివైపు.

"అలా చెయ్యకపోతే విషం మ్రింగి చస్తానంటుంది. మన అమ్మాయి."అంది. అదికూడా పాయింటే అన్నట్లు తలాడిం చారు. తరువాత కొద్దిక్షణాల పాటు ఆలో చిస్తూ పచార్లు చేసారు.

"సరే ..... ఎలక్షన్లు వస్తున్నాయి ప్రెస్ రిపోర్టర్లకు ఫోను చేసి పిలు." అన్నారు భజగోవిందంతో.

శ్రీవారి ప్రవర్తనకు కోపంగా లేచి విసురుగా పక్కగదిలోకి వెళ్ళిపోయింది సత్యవతమ్మ.

"మాతుమ పెళ్లిగూర్చి తల్లిబిడ్డల గొట్టుకుంటుంటే మధ్యన ప్రెస్ రిపోర్ట ర్లెందుకని" తలగోక్కున్నాడు భజ గోవిందం

* * *

మర్నాడు దేశంలోని అన్ని పత్రి కలూ తాటికాయలంత అక్షరాలతో ప్రముఖ రాజకీయనాయకుడు పరాంకుశం గారి పుత్రికకు, హరిజన విద్యార్థి పైడి రాజుకు త్వరలో వివాహం జరుగనున్నట్లు ప్రచురించాయి. అంతేకాదు, ఈ వివా హంలో శ్రీవారు కనబరచిన గొప్పతనాన్ని కులవివక్షతను పాటించని అతని హృదయ విశాలతని, సంస్కారాన్ని గొప్పగా పొగిడాయి.

ఆ పేపర్లను చూసిన భజగోవిందం ముక్కుమీద వ్రేలేసుకుని "నిజమేనా?" అని ప్రశ్నించాడు శ్రీవార్ని. తలూపారు వారు.

"అవునోయ్. నేనే ఆ విషయం పత్రికలవారికి చెప్పాను. ఈ దెబ్బతో ప్రజలంతా మన గొప్పతనాన్ని గుర్తి స్తారు. ఇక ఎలక్షన్లలో మనకిక తిరు గుండదు" అంటూ చిద్విలాసంగా నవ్వేరు.

"ఔరా! ఎంత పెద్ద ఎత్తువేశాడు!" మనసులోనే అనుకుని బుర్రగోక్కున్నాడు భజగోవిందం.